RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్

ప్రజల గొంతుక - నిజం కోసం..

ఆఫ్ ప్రజలు

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, సెప్టెంబరు 28, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 146 | పేజీలు: 8 | వెల : రూ.1




మధిరను అన్ని రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా

## తీర్చిదిద్దడమే లక్ష్యం

చింతకాని మండలంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన



# మార్చి నాటికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పూర్తి చేయాలి

### లక్ష్మీపురంలో నిర్మాణ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### కార్మికుల సంఖ్య పెంచి పనులు వేగవంతం చేయాలని ఆదేశం

ఖమ్మం: వచ్చే మార్చి నాటికి బోనకల్ మండలం లక్ష్మీపురంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌తో కలిసి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తరగతి గదులు, హాస్టల్ సముదాయాలు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్ భవనాలతో పాటు కిచెన్, డైనింగ్ హాల్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మాణం పూర్తయిందని, అకాడమిక్ బ్లాకుల్లో పలు విభాగాల పనులు పూర్తికాగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. మొత్తం తొమ్మిది సీనియర్ హాస్టళ్లలో మూడు పూర్తికాగా, మరో రెండు నిర్మాణ దశలో ఉన్నాయని, నాలుగు హాస్టళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయని

(మిగతా 2వ పేజీలో)

# పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్నబియ్యం పథకం సంతృప్తినిచ్చింది

### గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### హుజూర్‌నగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



హుజూర్‌నగర్, సెప్టెంబర్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): పేదలకు కడుపునిండా నాణ్యమైన ఆహారం అందించే సన్నబియ్యం పథకం ఎంతో సంతృప్తినిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని వీవీఎం స్కూల్‌లో హుజూర్‌నగర్, మట్టంపల్లి మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 16,32,810 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. తెలంగాణలో మొత్తం 1,06,28,092 రేషన్ కార్డులు ఉండగా, వాటి ద్వారా 3,42,57,109 మంది ఆహార భద్రత పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో 3,72,658 రేషన్ కార్డులు ఉన్నాయని, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 1,08,011 కార్డులు ఉన్నాయని మంత్రి వివరించారు. తాజాగా హుజూర్‌నగర్ మండలంలో 21,395, మట్టంపల్లి మండలంలో 16,203 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పేదలకు నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన దొడ్డుబియ్యం అక్రమ వ్యాపారాలకు ఉపయోగపడిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర జనాభాలో సుమారు 85 శాతం మందికి ఆహార భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డు అందని వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి కొత్త రేషన్ కార్డు మంజూరు చేసే ప్రక్రియ చేపడతామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. కార్యక్రమంలో పేరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ కే. నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ బచ్చు రామారావు, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ కవిత, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.




వాయిస్ ఆఫ్ ప్రజలు

సోమవారం, సెప్టెంబరు 28, 2026

# సూర్యాపేటలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

### ఓటరు నమోదు, నియోజకవర్గాల వారీగా కార్యాచరణపై చర్చ

సూర్యాపేట, సెప్టెంబర్ 27: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేటలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, జనసేన తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ లిడాక్టర్ గడల శ్రీనివాసరావులి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, పట్టభద్రులు, జనసైనికులు, వీర మహిళలు హాజరయ్యారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని లిపట్టభద్రుల ఓటరు నమోదు, క్షేత్రస్థాయి ప్రచారం, నియోజకవర్గాల వారీగా సమన్వయం, పట్టభద్రులతో సమావేశాలులి నిర్వహించే అంశాలపై చర్చించారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో పట్టభద్రులతో నేరుగా సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకోవడంతో పాటు ఎన్నికల కార్యాచరణను రూపొందించుకోవాలని గడల శ్రీనివాసరావు సూచించారు. రానున్న రోజుల్లో మండల, నియోజకవర్గ స్థాయిలో మరిన్ని సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



# కొండా లక్ష్మణ్ బాపూజీకి ఎంపీ వద్దిరాజు ఘన నివాళి



### తెలంగాణ కోసం మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకున్న మహనీయుడు: వద్దిరాజు

హైదరాబాద్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య లిలికొండా లక్ష్మణ్ బాపూజీలిలి జయంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యుడు లిలివద్దిరాజు రవిచంద్రలిలి ఘనంగా నివాళులర్పించారు. బాపూజీ 111వ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకున్న మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి నాంది పలుకుతూ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి కార్యకలాపాలకు తన ఇంటిని అందించిన గొప్ప తెలంగాణవాది బాపూజీ అని కొనియాడారు. స్వరాష్ట్రం సిద్ధించిన అనంతరం అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించిందని తెలిపారు. అలాగే ఉద్యానవన విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టి ఆయన సేవలను స్మరించుకుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన, ప్రజా హక్కులు, సామాజిక న్యాయం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని రవిచంద్ర అన్నారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ ఆ మహనీయుని దివ్యస్మృతికి ఘనమైన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు.

# మధిరను అన్ని రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### చింతకాని మండలంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన

ఖమ్మం: మధిర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు, నాణ్యమైన రహదారులు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆదివారం చింతకాని మండలంలో విస్తృతంగా పర్యటించిన భట్టి విక్రమార్క పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పందిళ్లపల్లి (ఆంజనేయపురం) నుంచి అనంతసాగర్--చింతకాని జడ్పీ రోడ్డు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసి, పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జగన్నాథపురంలో న్యూ మార్కెట్ మీదుగా చేపట్టనున్న మత్కేపల్లి--పందిళ్లపల్లి పంచాయతీరాజ్ బీటీ రోడ్డు, నాగులవంచ నుంచి రైల్వే కాలనీ ఆర్అండ్‌బీ రోడ్డు అండర్‌పాస్ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. చింతకాని మండల కేంద్రంలోని చెరువు వద్ద పర్యాటక వసతుల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. చెరువును ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడంతో పాటు గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహించేలా మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం నరసింహాపురం ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో రహదారులు, మౌలిక వసతులు



మెరుగుపడితే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని భట్టి విక్రమార్క అన్నారు. మధిర నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి ఫలాలను ప్రతి కుటుంబానికి చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# అశోక్ సింఘాల్ సేవలు చిరస్మరణీయం: ఈటల రాజేందర్



### భారత్ మండపంలో శతజయంతి వేడుకలకు హాజరైన మల్కాజిగిరి ఎంపీ

న్యూఢిల్లీ: విశ్వహిందూ పరిషత్, అశోక్ సింఘాల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన శ్రీ అశోక్ సింఘాల్ శతజయంతి వేడుకల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన కార్యక్రమానికి హాజరయ్యారు. పలువురు ప్రముఖులు, సాధువులు, విశిష్ట అతిథులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లి“మర్యాద పురుషోత్తముడు శ్రీ రామ్ కే దివ్య పదచిహ్న”లి పేరుతో రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరించారు. అయోధ్యలోని వివిధ పవిత్ర ప్రదేశాల్లో ప్రతిష్ఠించిన లి11 శ్రీరామ్ స్తంభాలనులి కూడా ఆవిష్కరించారు. అశోక్ సింఘాల్ సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు సంబంధించిన కార్యక్రమాల్లో జీవితాంతం పనిచేశారని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బెనారస్ హిందూ యూనివర్సిటీకి చెందిన ఐటీ–బీహెచ్‌యూలో మెటలర్జికల్ ఇంజనీరింగ్ అభ్యసించిన ఆయన, వ్యక్తిగత సౌకర్యాలకు దూరంగా సాదాసీదా జీవితం గడిపారని తెలిపారు. రామ జన్మభూమి ఉద్యమంలో అశోక్ సింఘాల్ కీలకంగా పనిచేశారని, దేశవ్యాప్తంగా భక్తులు, సాధువులను సమన్వయం చేయడంలో ఆయన పాత్ర ఉందని ఈటల రాజేందర్ అన్నారు. సామాజిక ఐక్యత, సాంస్కృతిక పరిరక్షణ, సమాజోద్ధరణ కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అశోక్ సింఘాల్ శతజయంతి వేడుకలు ఆయన సేవలు, త్యాగాలను స్మరించుకునే సందర్భంగా నిలిచాయని పేర్కొన్న ఈటల రాజేందర్, ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. ఆయన ఆశయాలు, సేవా స్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తెలిపారు.

# మార్చి నాటికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పూర్తి చేయాలి

తెలిపారు. నాలుగు జూనియర్ హాస్టళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం సంతృప్తి వ్యక్తం చేస్తూ, నిర్మాణంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. అవసరమైన మేరకు కార్మికుల సంఖ్యను పెంచి, అన్ని విభాగాల్లో పనులను సమాంతరంగా కొనసాగించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పాఠశాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని గుత్తేదారులను ఆదేశించారు.

**అక్షరమే ఆయుధంగా తెలంగాణ బిడ్డలు ఎదగాలి**

విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అక్షరాన్నే ఆయుధంగా మలుచుకుని తెలంగాణ బిడ్డలు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్య ద్వారా అంతరాలు లేని సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కులం, మతం, వర్గం, ప్రాంతం, ఆర్థిక స్థితిగతులకు అతీతంగా పిల్లలందరూ ఒకే ప్రాంగణంలో కలిసి చదువుకోవాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భిన్న వర్గాల విద్యార్థులు కలిసి విద్యను అభ్యసించడం ద్వారా వారిలో సమైక్యత, వసుధైక కుటుంబ భావన పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, సీపీఓ ఏ. శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ రాజకీయ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారు

### ఎన్నికల సంఘం కాంగ్రెస్‌ను గెలిపించాల్సిన బాధ్యత లేదు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 27: ఎన్నికల్లో ఓటమి వచ్చిన ప్రతిసారీ ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ ఆరోపణలు చేయడం సరికాదని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ గెలిచినప్పుడు ఎన్నికల ప్రక్రియను ప్రశంసించి, ఓడినప్పుడు ఈసీని తప్పుపట్టడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్‌ను గెలిపించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానికి లేదని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాల్సిన బాధ్యత ఈవీఎంలకు లేదని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తే ఆధారాలు చూపాలని సూచించారు. SIR ప్రక్రియలో ఓటర్ల జాబితాలను పునఃపరిశీలించడం, మృతులు, డూప్లికేట్ ఓట్లు, తప్పుల నమోదును సరిచేయడం సాధారణ ప్రక్రియలో భాగమేనని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. 1975 ఎమర్జెన్సీ సమయంలో పౌర హక్కులు, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు విధించిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని విమర్శించారు. దేశ ప్రయోజనాలు, జాతీయ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, Nation First తమ సిద్ధాంతమని కిషన్ రెడ్డి తెలిపారు.



# బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహనతో ముందడుగు

### పీపుల్స్ ప్లాజాలో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన మంత్రి సీతక్క

హైదరాబాద్: బ్రెస్ట్ క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి సకాలంలో చికిత్స పొందడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చని మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన ర్యాలీని మంత్రి సీతక్క జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు శరీరంలో కనిపించే అనుమానిత మార్పులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. రొమ్ములో గడ్డ, ఆకారం లేదా పరిమాణంలో మార్పులు, చర్మంలో అసాధారణ మార్పులు, చనుమొన నుంచి అసాధారణ స్రావం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. ముందస్తు గుర్తింపు, సకాలంలో వైద్య పరీక్షలు, తగిన చికిత్స ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యంపై అపోహలు, భయాలను వీడి అవసరమైనప్పుడు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అవగాహన ర్యాలీలో పాల్గొన్న మహిళలు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను మంత్రి సీతక్క అభినందించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

### ‘ది ప్యారడైజ్’ చూసిన కేటీఆర్..



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నాని హీరోగా వచ్చిన ‘ది ప్యారడైజ్’ సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని సుదర్శన్ థియేటర్‌లో పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులతో కలిసి ఈ చిత్రాన్ని వీక్షించిన ఆయన, సినిమాలోని ఓ పవర్‌ఫుల్ డైలాగ్‌ను ప్రస్తావిస్తూ ‘అదే ఎవరో మీకు తెలుసు’ అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సినిమా చూసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ దర్శకుడు శ్రీకాంత్ ఓదెలకు అభినందనలు తెలిపారు. అస్తిత్వం కోసం ఆరాటం, అణిచివేతపై పోరాటాన్ని సినిమాలో బలంగా చూపించారని ప్రశంసించారు. హీరో నాని తన మిత్రుడని, కథానాయకుడి పాత్రలో జీవించారని కొనియాడారు. సందర్భం వచ్చినప్పుడు గడ్డిపోచలు కూడా గడ్డపారలుగా మారతాయనే సందేశం బాగుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను పోలిన పాత్రలో నటించిన ప్రియదర్శికి కేటీఆర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ‘చావు నోట్లో తల పెట్టయినా... మీకు గుర్తింపు తెస్తా!!’ అనే డైలాగ్‌ను గుర్తుచేస్తూ.. ‘ఆ డైలాగ్ చెప్పింది ఎవరో మీకు తెలుసు కదా’ అని వ్యాఖ్యానించారు. నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ‘ది ప్యారడైజ్’ చిత్రం అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం నేపథ్యంలో రూపొందింది. సినిమాలో మాజీ సీఎం కేసీఆర్‌ను పోలిన పాత్ర ఉండటంతో విడుదలకు ముందే బీఆర్ఎస్ వర్గాల్లో, అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొన్న విషయం తెలిసిందే.

# సాధువెల్లిలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మండలం సాధువెల్లి గ్రామంలో స్వాతంత్ర సమరయోధుడు, మాజీ మంత్రివర్యులు స్వర్గీయ తెలంగాణ జాతిపిత ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ గ111 వ జయంతి వేడుకలు నిర్వహించారు పులుగం బిక్షపతి నేత ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆ మహానీయునికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాధువెల్లి గ్రామ పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు పులుగం బిక్షపతి నేత మాట్లాడుతూ 1969 లో తెలంగాణ కోసం మంత్రి పదవీ వదులుకొని స్వరాష్ట్రం కోసం పరితపించిన తొలితరం ఉద్యమకారుడు, న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా రాజకీయాలకు వన్నెతెచ్చిన మహానుభావుడు సంఘాలను స్థాపించిన మొదటి వ్యక్తి కొండా బాపూజీ అని, విద్యా విద్య అన్ని రంగాల్లో అందరూ కొనసాగుతున్నారు కానీ మన పద్మశాలి నేతన్నలని మాత్రం రాజకీయాల్లో రాణించట్లేదు అని వాపోయారు ఈ కార్యక్రమంలో పులగం బిక్షపతి, కట్కం వీరయ్య, బేతి విశ్వనాథం, బేతి బాలరాజు, కొంగరీ బిక్షపతి, పులగం వెంకటేశం, ఇడం.రామకృష్ణ, గణేష్, పలువురు నేతలు గ్రామస్తులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 27(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంర్ఫ్ ) ఒ(ఎల్ఓసి) ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంర్ఫ్ మరియు (ఎల్ఓసి)మంజూరి పత్రాలు (చెక్కులను) అందజేశారు.

జనేగా మణెమ్మ రూ.18500/-పి. ప్రభావతి రూ 35000/- జంపాల సరోజ ( ఎల్ఓసి )- రూ 200000/- ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ.....ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోయిని వెంకటేష్, శ్రీధర్ వర్మ, కొలన్ యుద్ధం రెడ్డి, మరియు తదితరులు పాల్గొన్నారు.



# బోడుప్పల్లో చాకలి ఐలమ్మ కొండ లక్ష్మణ్ బాపూజీలకు ఘన నివాళులు

**తెలంగాణ ఉద్యమ కెరటాలు చాకలి ఐలమ్మ, కొండ లక్ష్మణ్ బాపూజీ.**

**బోడుప్పల్లో 397వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల.**

**అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నత్తి మైసయ్య.**

బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్, సెప్టెంబర్ 27 : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 397వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. అదేవిధంగా తెలంగాణ వీరవనిత సాకలి ఐలమ్మ జయంతి, తెలంగాణ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా వారికి నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ, భూమికోసం, భుక్తి కోసం, కోసం, బానిస బతుకుల విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం చేసిన వీరవనిత సాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని, అదేవిధంగా తెలంగాణ ఉద్యమ నాయకుడు మాజీమంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ తొలి దశ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రము ఏర్పాటు కోసం తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలేసిన మహా ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని వారి స్ఫూర్తితో, వారి ఆశయాలను ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. అదేవిధంగా అక్టోబర్ 18 వ తేదీ ఆదివారం రోజున 400వ వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రణాళిక చేస్తున్నామని, త్వరలోనే సమాన్వయ సమావేశం ఏర్పాటు చేసి 400 వారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహణపై చర్చిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇటికల రవీందర్, భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, బోడుప్పల్ అరుంధతి మాదిగ సంక్షేమ సంఘంఅధ్యక్షుడు గరుగుల యాకయ్య, చిల్ల అంజయ్య, యేసు రాజు, జడ శ్రీనివాస్, గల్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 'రన్ విత్ సోల్జర్స్ -- రన్ ఫర్ సోల్జర్స్'లో డా. పెరుక రాజు

## భాగ్యనగరంలో ఉత్సాహంగా మారథాన్ సైనికులతో కలిసి పరుగులు తీసిన యువత



ఉదయం నిర్వహించిన 'రన్ విత్ సోల్జర్స్ రన్ ఫర్ సోల్జర్స్' మారథాన్ ఉత్సాహభరిత వాతావరణంలో వైభవంగా సాగింది. రక్షణ శాఖకు చెందిన సిబ్బంది, మాజీ సైనికులు, విద్యార్థులు, యువతీ యువకులతో పాటు చిన్నా పెద్దా తేడా లేకుండా వివిధ వయసుల వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 5 కి.మీ., 10 కి.మీ., 21 కి.మీ. విభాగాల్లో నిర్వహించిన ఈ మారథాన్లో పురుషులతో పాటు మహిళలు సైతం ఉత్సాహంగా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పొరుగు రాష్ట్రాల నుంచి పాల్గొనడం విశేషం. ఈ మారథాన్లో ప్రముఖ కవి, బహుభాషావేత్త, ఆర్మీ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ డా. పెరుక రాజుతో పాటు యూనిట్కు చెందిన సైనికులు రమణ, ఉమేష్, లక్ష్మణ్, శ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి పర్యటన



కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 27(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ (కుత్బుల్లాపూర్ డివిజన్) పరిధి గాయత్రి నగర్ లో కాలనీ వాసులు తమ కాలనీ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలియజేయడంతో కాలనీ వాసులతో కలిసి కాలనీలో పర్యటించి వర్షపు నీరు నిలిచిపోవడం డ్రైనేజీ సమస్యలు రోడ్ల ఇబ్బందులు తదితర సమస్యలను పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సుమేర్ సింగ్ మాధవ రెడ్డి సంజీవ్ రెడ్డి బ్రజేష్ ఝా రజనీకాంత్ రెడ్డి సురేష్ పాపయ్య భాస్కర్ రెడ్డి నిఖిల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

**సూరారం మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ**

**గాజులరామారం లో ఘన నివాళులు అర్పించిన పద్మశాలి సంఘం సభ్యులు**

కుత్బుల్లాపూర్. సెప్టెంబర్ 27(వాయిస్ టుడే): తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి తరం తెలంగాణ ఉద్యమ నాయకుడు, బడుగు బలహీన వరాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహానీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని సూరారం మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ 111 వ జయంతి ని పురస్కరించుకొని గాజులరామారం చౌరస్తా లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి సందర్వంగా నివాళులు అర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి గాజులరామారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అధ్యర్యంలోనిర్వహించిన ఈ కార్యక్రమం లో మంత్రి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశం కోసం పోరాడటమే కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు.పదవుల కంటే ప్రజాసేవకే ప్రాధాన్యతనిచ్చిన గొప్ప త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని, వెనుకబడిన వర్ణాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన సామాజిక ఉద్యమకారుడని వెర్కొన్నారు. ఈ కార్యక్రమం లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం యువజన విభాగం అధ్యక్షులు ఆడెపు సతీష్, గాజులరామారం డివిజన్ పద్మశాలి సంఘం అధ్యక్షులు సాయినాథ్ నేత,సీనియర్ జర్నలిస్ట్ టి రమేష్ తో పాటు పద్మశాలి సంఘం నాయకులు రమేష్, కస్తూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 27(వాయిస్ టుడే): ఈ నెల 30వ తేదీన సిరిసిల్లలో జరగనున్న ముఖ్యమంత్రి సభకు సంబంధించిన ఏర్పాట్లను కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్, కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం, వేదిక, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణతో పాటు ఇతర మౌలిక వసతులపై సంబంధిత నాయకులు, నిర్వాహకులతో ఆయన చర్చించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కూన శ్రీశైలం గౌడ్ సూచించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు తాగునీరు, కూర్చునే సౌకర్యం, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సభను విజయవంతంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా సిరిసిల్ల పట్టణంలో సభకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు బల్మూర్ వెంకట్ మ్మెల్సీ శంకర్ నాయక్ మరియు సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కే.కే మహేందర్ రెడ్డి డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# అసైన్డ్, భూదాన్ భూములను పేదలకు పంపిణీ చేయాలి

## తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 27: రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న అసైన్డ్, ప్రభుత్వ, భూదాన్ భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఎర్రవెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325 పరిధిలోని 388 ఎకరాల అసైన్డ్ భూమిని 400 మంది పేదలకు పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడాన్ని ఆయన స్వాగతించారు. రాష్ట్రవ్యాప్తంగా అసైన్డ్, ప్రభుత్వ భూములను గుర్తించేందుకు ఐఏఎస్ అధికారిణి దేవసేన సారథ్యంలో ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అన్యాక్రాంతమైన భూములను గుర్తించాలని కోరారు. ముఖ్యంగా రాజకీయ నాయకుల అక్రమ ఆక్రమణల్లో ఉన్న భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



# హిమాయత్నగర్లో ఘనంగా ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' వీక్షణ

హిమాయత్నగర్, సెప్టెంబర్ 27: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఆదివారం హిమాయత్నగర్ బూత్ నం. 5లో బీజేపీ నాయకుడు నర్సింగ్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. ప్రధాని మోదీ 138వ ఎపిసోడ్ ప్రసంగాన్ని ఈ సందర్భంగా శ్రద్ధగా ఆలకించారు. ఈ సందర్భంగా నర్సింగ్ గౌడ్ మాట్లాడుతూ... ప్రతి నెలా చివరి ఆదివారం ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రతి బూత్ స్థాయిలో క్రమం తప్పకుండా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ దేశ ప్రజలతో పంచుకునే స్ఫూర్తిదాయక ఆలోచనలు, వికాస సందేశాలను బూత్ స్థాయిలోని ప్రతి ఇంటికీ చేరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యంగా మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ, పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోపిశెట్టి ప్రమోద్, ధీరేందర్ బియాని, వంశీ, భాను, అపేక్ష, బ్రిజేష్ జైస్వాల్, సాగర్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మలిదశ ఉద్యమానికి బలమైన పునాది వేసిన ఉద్యమ వీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

## బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 27(వాయిస్ టుడే ): ఉద్యమ వీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని పురస్కరించుకొని కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్స్ లో కొంపల్లి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమం వేడుకకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేశ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తెలంగాణ మలిదశ ఉద్యమానికి బలమైన పునాది వేసిన ఉద్యమ వీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఏ ఒక్క వర్గానికి చెందిన నేత కాదని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోరిన మహానేత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కొంపల్లి పద్మశాలి సంఘం చైర్మన్ మామిడాల ఉమాశంకర్, ప్రెసిడెంట్ గోలి ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ కె. మల్లికార్జున రావు, ఎస్. వెంకటేష్ నేత, కార్యదర్శి కె. శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు భోగా నరేందర్, పి. రాకేష్, వి. రాజేందర్, కోశాధికారి కొండా కరుణాకర్, మాజీ కౌన్సిలర్లు డప్పు కిరణ్, రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వాయిస్

హైదరాబాద్
సోమవారం 28 సెప్టెంబరు 2026



## యువ టూరిజం క్లబ్ పర్యాటక పోటీల్లో యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రథమ బహుమతి

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 2026: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2026లో ఇంటర్మీడియట్ విద్యార్థుల మధ్య యువ పర్యాటక క్లబ్ ఆధ్వర్యంలో పర్యాటక ప్రోత్సాహక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేక శాస్త్రీయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. అలాగే పాతగుట్ట, సురేంద్రపురి ఆలయాల విశిష్టతను తెలియజేస్తూ లఘు వీడియోలు, రీల్స్, స్కిట్స్ ద్వారా పర్యాటక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మన సాంస్కృతిక వారసత్వ కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉందని లఘు వీడియోలు ,రీల్స్, స్కిట్స్, తెలియజేశారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయిలో యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రథమ బహుమతి ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భాస్కరరావు మరియు ఇంటర్మీడియట్ విద్యాధికారి సురేష్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు బహుమతిని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి. మంజుల మేడం మరియు జిల్లా పర్యాటక అధికారి ధనుంజయ్ మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు రాజు, రమేష్, నాగలక్ష్మి, పద్మ రేఖ మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పి. మంజుల మేడం విద్యార్థులను, అధ్యాపకులను అభినందిస్తూ, యాదాద్రి భువనగిరి జిల్లా పర్యాటక విశిష్టతను విద్యార్థుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎంతో సంతోషకరమని తెలిపారు. విద్యార్థుల సృజనాత్మకత, చురుకైన భాగస్వామ్యంతో ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు ఘనం

**- 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్య తబస్సుం షఫీక్ అహ్మద్**

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- బంజారాహిల్స్ 31వ వార్డులో కొండా లక్ష్మణ్ బాపూజీ గారి 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఉద్యమ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా బంజారాహిల్స్ 31వ వార్డులో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బానోత్ సంతోష్ నాయక్ అధ్యక్షత వహించారు. 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్య తబస్సుం షఫీక్ అహ్మద్ వార్డు పెద్దలు, ప్రజా ప్రతినిధులు, యువత మరియు స్థానిక ప్రజలు పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి , మల్లయ్య, కొండల్ రెడ్డి, బాలు, రాజేశ్వర్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ సోమ్లా నాయక్, షఫీఖ్ అహ్మద్, ముత్యాలు, నరసింహ, లక్ష్మీ నరసింహ భీమా నాయక్, గోవర్ధన్, మహ్మూద్, నరేంద్ర నాయక్ , వెంకన్న , వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్, బానోత్ జ్యోతి పాల్గొన్నారు. అలాగే, డీసీసీ జనరల్ సెక్రటరీ మజర్ ఈ కార్యక్రమంలో పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను, ప్రజా ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో యువత కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జగదీశ్, సంపత్, సాయి, వంశీ, మహేష్ బాబు, భార్గవ్, పండు తదితర యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజల హక్కుల కోసం, తెలంగాణ కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ప్రజాసేవ, పోరాట స్ఫూర్తి మరియు త్యాగాలు నేటి తరానికి, ముఖ్యంగా యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు, సమాజ అభివృద్ధి కోసం యువత ఐక్యంగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.వార్డు పెద్దలు, కౌన్సిలర్, ప్రజా ప్రతినిధులు, యువత మరియు స్థానిక ప్రజల సమక్షంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# ఉచిత వైద్య శిబిరాలు ప్రజలు వినియోగించుకుని ఆరోగ్యవంతులుగా ఎదగాలి

**బోనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్**

**భువనగిరిలో ఘనంగా ఉచిత క్యాన్సర్..వైద్య పరీక్షల శిబిరంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్**




(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):-ఉచిత వైద్య శిబిరాలు ప్రజలు వినియోగించుకుని ఆరోగ్యవంతులుగా ఎదగాలని బోనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారంరోజు భువనగిరి పట్టణంలో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా మహిళలు ఈ ఉచిత క్యాన్సర్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో క్యాన్సర్ స్క్రీనింగ్, 2డి ఎకోతో పాటు వివిధ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి వైద్యుల సలహాలు, సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు వైస్ చైర్మన్.. పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ నాకోటి నాగేష్ అసిస్టెంట్ గవర్నర్.. పక్కీరు కొండల్ రెడ్డి రోటరీ క్లబ్ అధ్యక్షులు.. కూచిపట్ల సత్యనారాయణ రెడ్డి..సెక్రటరీ: కడారి రమేష్ బాబు,ట్రెజరర్: పెండెం వేణుగోపాల్..పాల్గొన్న రోటేరియన్లు డా. యంపల్ల బుచ్చి రెడ్డి -- చైర్మన్, మెంబర్‌షిప్, కాకతీయ రీజియన్.. జి. జ్ఞాన ప్రకాష్ రెడ్డి -- చైర్మన్, సోషల్ మీడియా..బండారు శ్రీనివాస్ రావు -- చైర్మన్, ఎన్విరాన్‌మెంట్, కాకతీయ రీజియన్..ఎం.ఎ. రహీం -- అధ్యక్షులు, రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్..శెట్టి బాలయ్య యాదవ్.. మంచికంటివెంకటేశం,కొక్కలకొండ నిమ్మయ్య,కొమ్మిడి రవీందర్ రెడ్డి, జిలాల కొండల్ రెడ్డి, కోమటి రెడ్డి మోహన్ రెడ్డి, కారిపె నర్సింగ్ రావు,ఇటిక్యాల దేవేంద్ర చారి, దిడ్డి బాలాజీ, కె.జె.ఎస్.వి.ప్రకాష్,పడమటి జగన్మోహన్ రెడ్డి, జిట్ట భాస్కర్ రెడ్డి, తవిటి వెంకట నారాయణ, పాశం పండరీనాథ్,పడాల భాస్కర్ రావు, ఎస్.పి. ఉపేందర్ రావు, ఎస్.పి. స్పందన,చొల్లేటి శ్రీనివాస్,భోగ హరికృష్ణ,గూడూరు అశోక్ రెడ్డి,కొంతం పద్మా రెడ్డి,ఎం.డి. హనీఫ్ మెమన్,ఇటిక్యాల లావణ్య పాల్గొన్నారు. ఉచిత మందులు, అల్పాహారం, భోజనానికి దాతల సహకారం ఈ హెల్త్ క్యాంపు కోసం ప్రిన్స్ మెడికల్ హాల్, భువనగిరి అధినేత జాకీర్ సుమారు రూ.1,00,000 విలువైన మందులను ఉచితంగా అందజేశారు. అలాగే ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు, రోటరీ సభ్యులకు పకీర్ కొండల్ రెడ్డి ద్వారా సుమారు రూ.2 వేలతో అల్పాహారం, టీ ఏర్పాటు చేశారు. అదేవిధంగా సద్ది వెంకట్ రెడ్డి,అధినేత, వివేరా హోటల్, భువనగిరి, సుమారు రూ.25,000 మధ్యాహ్న భోజనాన్ని ప్రజలకు ఉచితంగా అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు, మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేశారు.



## ట్రస్మా ఆధ్వర్యంలో విద్యా సేవారత్న అవార్డు ప్రధానోత్సవం

**ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, దేశభక్తిని నేర్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు.భువనగిరిలోని సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో ట్రాస్మా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పాలకూర్ల వెంకటేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవానికి ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ట్రాస్మా రాష్ట్ర వ్యవస్థాపకుడు కందాల పాపిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారి చేతుల మీదుగా జిల్లా లోని 17మండలలోని 127 పాఠశాల చెందిన కరస్పాండెంట్లు, ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాతో సత్కరించి మెమొంటో అందజేసి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించి విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రశ్నించే తత్వం, నైపుణ్యాలను పెంపొందించాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమన్నారు. విద్య, విద్యార్థులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. బడ్జెట్ స్కూల్స్ కరస్పాండెంట్లకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ల పల్లి శ్రీవాణి రవి కుమార్, ఎంఈఓ రంగరాజన్, ట్రస్మా గౌరవ అధ్యక్షులు మెరుగు మధు,గాదె సోమిరెడ్డి, జిల్లా కోశాధికారి వంగూరి పాండు,గౌరవ సలహాదారులు మిర్యాల దుర్గ ప్రసాద్,పట్టణ అధ్యక్షులు కాటా చిన్నప్ప,ప్రధాన కార్యదర్శి యాదయ్య,రంగరావు, భాగ్య లక్ష్మి, మంజుల, అఖిల, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో 28న జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీని జయప్రదం చేయండి

**:- ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి**



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- మేడ్చల్ చెక్ పోస్ట్ వద్ద గల వైఎస్సార్ విగ్రహం నుండి నేడు ఉదయం 10:00 నుండి మేడ్చల్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నామ ని ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త తమ విధిగా హాజరుకావాలని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి అన్నారు.ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష ధోరణికి నిరసనగా, ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై ఏఐసీసీ, టిపిసిసి అధ్యక్షులు శమ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం.. ఓటు హక్కు పరిరక్షణ కోసం... ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం..మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ సెల్, బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రజల అవసరాలను గుర్తించి సేవలందించాలి

**డా. శ్రీరామ్ వెంకట్..**

**తార్నాక సేవ--25లో ఉచిత ఆరోగ్య పరీక్షలు..**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): సేవ అంటే కేవలం కార్యక్రమాలు నిర్వహించడం కాదని, ప్రజల అవసరాలను గుర్తించి వాటిని తీర్చినప్పుడే సేవకు సార్థకత లభిస్తుందని బీజేపీ మహంకాళి జిల్లా ఇంటలెక్చువల్ సెల్ ఇన్‌చార్జి డా. శ్రీరామ్ వెంకట్ అన్నారు. సేవా పక్వాడా స్ఫూర్తితో నిర్వహిస్తున్న 'తార్నాక సేవ--25'లో భాగంగా హనుమాన్‌నగర్‌లో 9వ, 10వ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. శ్రీరామ్ వెంకట్ మాట్లాడుతూ.. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అవసరమైన మందులు, కళ్లద్దాలు అందించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 'తార్నాక సేవ--25'ను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా నిరంతరం కొనసాగించే సేవా ప్రయాణంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో సమాజంలోని వివిధ వర్గాలకు అవసరమైన మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు.కార్యక్రమంలో తార్నాక డివిజన్ అధ్యక్షుడు కంటే కరుణాకర్, కృష్ణగౌడ్, గీతా సెల్ కన్వీనర్ అలేటి అనుష తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ఆదర్శనీయం

**:-ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు ప్రజల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు, తెలంగాణ ఉద్యమ మార్గదర్శి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి గారు ఉప్పల్ వివేకానంద కమ్యూనిటీ హాల్ వద్ద ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేశారని, పదవులను సైతం త్యజించి ప్రజా ఉద్యమాలకు అంకితభావంతో సేవలందించారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.తెలంగాణ సమాజం కోసం బాపూజీ చూపిన మార్గం, ఆయన సేవా స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ కావడం ఉద్యోగం కాదు.. బాధ్యత

**నీట్ ర్యాంక్ బాధ్యతకు ప్రారంభం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**




నాచారం (వాయిస్ టుడే): నీట్-2026లో ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్‌లో సీట్లు పొందిన విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎదగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. నాచారంలోని డీపీఎస్ పాఠశాలలో తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ మెడికల్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ సక్సెస్ మీట్ నీట్-2026 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నెలల తరబడి చేసిన కష్టం, క్రమశిక్షణ, ఓపిక, నిరంతర సాధన ఫలితంగానే నీట్‌లో విజయం సాధ్యమైందన్నారు. నీట్ ర్యాంక్ ప్రయాణానికి ముగింపు కాదని, బాధ్యతకు ప్రారంభమని పేర్కొన్నారు.వైద్య వృత్తిలో జ్ఞానంతో పాటు మానవత్వం, సేవాభావం, నైతిక విలువలు ఎంతో ముఖ్యమని తెలిపారు. పేదలు, గ్రామీణులు, బలహీన వర్గాల ఆరోగ్య అవసరాలను గుర్తించి సేవలందించే వైద్యులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. వైద్య విద్యలో సీటు పొందిన పేద విద్యార్థులకు ఫీజుల భారం తగ్గించేందుకు తాను సహకరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రుల త్యాగం, ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. పిల్లలను ఇతరులతో పోల్చకుండా వారి ఆసక్తి, సామర్థ్యాలను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ విజయ ప్రస్థానం, ఎదుర్కొన్న కష్టాలను వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ మల్క నవీన్‌కుమార్, అధ్యక్షుడు మల్లోజు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఉపాధ్యక్షుడు రమేష్‌కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..



# నాచారం నేతాజీ క్లబ్‌లో ఘనంగా వేలంలో లడ్డును 1.08 లక్షలకు బీఆర్ఎస్ నాయకుడు ఊటుకూరి రాజేష్‌గౌడ్ దక్కించుకున్నారు



నాచారం (వాయిస్ టుడే):నాచారం నేతాజీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గణనాథుడి లడ్డూ వేలం పాట ఉత్సాహంగా జరిగింది. ఈ వేలంలో బీఆర్ఎస్ నాయకుడు ఊటుకూరి రాజేష్‌గౌడ్ రూ.1.08 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అలాగే కమిటీ ఆధ్వర్యంలోని చిన్న లడ్డూను ఊటుకూరి సందీప్‌గౌడ్ రూ.35 వేలకు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మేడాల మల్లికార్జున్‌గౌడ్‌తో పాటు నేతాజీ కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా బొజ్జ గణపయ్య శోభయాత్ర

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పటాన్ చేరు నియోజకవర్గం, ఇంద్రేశం మున్సిపాలిటీ రామేశ్వరం బండ గ్రామంలో శ్రీ హనుమాన్ యూత్ అసోసియేషన్ గ్రామ పెద్ద కౌన్సిలర్ అంతిరెడ్డి, అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బొజ్జ గణపయ్య శోభయాత్రను గ్రామస్తుల సమక్షంలో నిర్వహించారు, ఈ కార్యక్రమానికి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విచ్చేసి వినాయక స్వామిని దర్శించుకొని శోభాయాత్రను ప్రారంభించారు, అనంతరం అంతిరెడ్డి మాట్లాడుతూ రామేశ్వరం బండ గ్రామంలో శ్రీ హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 45 సంవత్సరాలు నుండి వినాయక చవితి రోజున వినాయకుని ప్రతిష్టించి ఘనంగా పూజలు నిర్వహిస్తామని ప్రతిరోజు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని అన్నారు, 13 రోజులు పూజలు అందుకున్న వినాయక స్వామి శోభయాత్ర సందర్భంగా వినాయక స్వామి పూజలో ప్రత్యేక పూజలో అందుకున్న లడ్డును వేలం పాటలో నిర్వహించారు, మొదటి లాడ్డును 1లక్ష 73వేలకు భూపాల్ రెడ్డి,

2వ లడ్డును 1లక్ష 33 వేలకు, 3వ లడ్డును 55వేలకు లక్ష్మణ్ గౌడ్ లడ్డులను సొంతం చేసుకున్నారు, వీరికి హనుమాన్ యూత్ అసోసియేషన్ తరపున ఘనంగా శాలువాతో సత్కరించి సన్మానం చేశారు, బొజ్జ గణపతయ్య శోభాయాత్రలో ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్ ప్రమీల, గ్రామ పెద్దలు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు రామేశ్వరం బండ గ్రామ పెద్దలు, గ్రామ యువత, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.




# ఎస్టీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలి

## నంగారా బేరీ లంబాడి హక్కుల పోరాట సమితి..

సికింద్రాబాద్, సెప్టెంబర్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఎస్టీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని నంగారా బేరీ లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ధరావత్ గణేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమితి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి నూతన జాతీయ అధ్యక్షుడిగా ధరావత్ గణేష్ నాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బానోతు రాజ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ముడావత్ రవీందర్ నాయక్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా సుశీల బాయ్ ఎన్నికయ్యారు. అనంతరం ధరావత్ గణేష్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో జాప్యం చేస్తే రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రజలను సమీకరిస్తామని హెచ్చరించారు.తెలంగాణలో గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. గిరిజనులకు మంత్రి పదవి కల్పించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం సమితి నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు పూల్‌సింగ్ నాయక్, పరుశురాం నాయక్, సుహాసిని, శివానీ, తణిష్క, సుశీల, ఇందల్ రాథోడ్, వెంకటే బంజారా, రాజ్‌కుమార్, జైపాల్ నాయక్, బాలు నాయక్, హారీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య

## భార్యపై రోకలి బండతో దాడి చేసిన భర్త

## అక్కడికక్కడే మృతి చెందిన భార్య

సికింద్రాబాద్, సెప్టెంబర్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం దారుణ హత్య ఘటన చోటుచేసుకుంది. బాగ్‌లింగంపల్లిలోని మాచర్ల జ్యువెలరీ షాప్ సమీపంలో ఉదయం సుమారు 11:22 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. కుటుంబ కలహాల నేపథ్యంలో నరేందర్ (34) తన భార్య తేజస్వి (29)పై రోకలి బండతో దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో తేజస్వి తలకు తీవ్ర గాయాలు కావడంతో భారీగా రక్తస్రావం జరిగినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే స్పృహ కోల్పోయినట్లు సమాచారం. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే తేజస్వి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఘటన అనంతరం నరేందర్ అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. దీంతో నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. హత్యకు దారితీసిన కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.




# గొప్ప గాంధేయవాది కొండా లక్ష్మణ్ బాపూజీ.. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు: తొలి, మలి దశ ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేసిన గొప్ప గాంధేయవాది కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా పద్మశాలి సంఘం పటాన్చెరు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మూడు తరాలపాటు అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. జాతికి వారు చేసిన సేవలను భవిష్యత్తు తరాలకు అందించాలన్న సమన్నత లక్ష్యంతో పటాన్చెరులో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన అదృష్టం తనకు దక్కిందన్నారు. బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, రామచంద్రారెడ్డి, వంగరి అశోక్, కంకర శీనయ్య, వెంకటేష్, శంకర్, పద్మశాలి సంఘం ప్రతినిధులు రఘురాములు, ధర్మచంధ్, పశుపతి, గీతా వెంకట్, మధు, లక్ష్మణ్, కృష్ణ, వర ప్రసాద్, రాములు, జగదీష్, లక్ష్మణ్, నాగరాజు, సతీష్, విజయ్, పట్టణ నాయకులు, కార్యకర్తలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



# పోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్ ప్రారంభోత్సవం

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : జేపీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో MDR ఫౌండేషన్ చైర్మన్ మాద్రి దేవేందర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పాఠ్యాంశాలతో పాటు ఆటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణానికి కృషి చేయాలని పేర్కొన్నారు. చిన్నారుల్లో విద్యతో పాటు సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సామాజిక నైపుణ్యాలను పెంపొందించేలా పోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జేపీ కాలనీ పెద్దలు,వీణ= యువసేన సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన గణేశ్ నిమజ్జనం



హైదరాబాద్: ఎంతో వైభవంగా సాగిన వినాయక నిమజ్జన ఘట్టం ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఆదివారం సాయంత్రం ముగిసింది. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన గణనాథులకు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆదివారం రోజున హుస్సేన్‌సాగర్‌లో ఎన్ని విగ్రహాలు నిమజ్జనం అయ్యాయనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. చివరి నిమిషం వరకు విగ్రహాల రాక కొనసాగడంతో గణాంకాల సేకరణ ఆలస్యమవుతున్నట్టు తెలుస్తోంది. నిమజ్జనం పూర్తికావడంతో అధికారులు ప్రస్తుతం సాగర్ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. పూజాసామగ్రి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ అవశేషాలు, ఇతర వ్యర్థాల తొలగింపు పనులు సోమ, మంగళవారాల్లో నిరంతరాయంగా కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్ పరిసరాలను వీలైనంత త్వరగా సాధారణ స్థితికి తీసుకురావడానికి భారీగా సిబ్బందిని, యంత్రాలను రంగంలోకి దించారు.

# PNR టౌన్‌షిప్‌లో బొజ్జ గణపయ్య శోభాయాత్ర.

## కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా వేడుకలు ప్రారంభం

## పదో తరగతి ప్రతిభావంతులకు బహుమతుల ప్రదానం చేసి కాటా శ్రీనివాస్ గౌడ్



పటాన్‌చెరు నియోజకవర్గం, ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని PNR టౌన్‌షిప్ కాలనీలో చత్రపతి శివాజీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బొజ్జ గణపయ్య శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. కమిటీ అధ్యక్షుడు మురళి మరియు సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నిమర్జనం కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, స్వామివారిని దర్శించుకుని శోభాయాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ, వినాయక చవితి రోజున స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి గత 13 రోజులుగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు అన్నప్రసాద వితరణలు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొని లడ్డూను దక్కించుకున్నారని పేర్కొన్నారు. శోభాయాత్రలో చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇదే ప్రాంగణంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కాలనీ విద్యార్థులకు కాట శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం కాలనీవాసులు, భక్తులు "బై బై గణేషా... మళ్లీ వచ్చే సంవత్సరం త్వరగా రా" అంటూ భక్తిశ్రద్ధలతో గణనాథునికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలి

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ విజ్ఞప్తి

నాచారం (వాయిస్ టుడే): నల్గొండ--ఖమ్మం--వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన పేరును పరిశీలించి అవకాశం కల్పించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి బయోడేటా అందజేసి విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా విద్యార్థి నాయకుడిగా, తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడిగా పనిచేశానని, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉద్యమాల సందర్భంగా జైలుకు వెళ్లి పలు కేసులు ఎదుర్కొన్నానని తెలిపారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ9లో జర్నలిస్టుగా, హైకోర్టు న్యాయవాదిగా, సుప్రీంకోర్టు ఎన్‌రోల్డ్ అడ్వకేట్‌గా సేవలందించానన్నారు. పలు సామాజిక, వామపక్ష ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేసిన తనకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ

# అమీన్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో గణపతి నిమర్జనంలో పాల్గొన్న ఎమ్మెల్యే

## గణనాథుని నిమజ్జన కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్చెరు : వినాయక చవితి నవరాత్రులు పురస్కరించుకొని.. ఆదివారం సాయంత్రం పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఇంద్రేశం బీరంగూడ, రామచంద్రాపురం పరిధిలోగల వినాయక మండపాల వద్ద ఏర్పాటుచేసిన నిమజ్జన కార్యక్రమాలకు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాలను ప్రారంభించారు. నియోజకవర్గం వ్యాప్తంగా 11 రోజులపాటు నవరాత్రులు నిర్వహించుకుని.. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు..

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం 28 సెప్టెంబరు 2026

# ముస్నూరు కాపు ట్రస్ట్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

సూర్యాపేట, సెప్టెంబర్ 27 : ముస్నూరు కాపు ట్రస్ట్ సర్వసభ్య సమావేశం ఆదివారం సూర్యాపేట పట్టణంలోని దురాజ్‌పల్లి గుట్ట వెనుక ఉన్న ట్రస్ట్ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో 2026--2028 సంవత్సర కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రస్ట్ సభ్యులు పెద్దిరెడ్డి గణేష్, పెద్దిరెడ్డి రాజా, మండారపు దశరథ రామారావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. నూతన కమిటీలో గౌరవ సలహాదారుగా ఉప్పు శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా మిర్యాల కృష్ణమూర్తి, అధ్యక్షులుగా గాలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రామసాని శ్రీనివాస్ నాయుడు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మట్టపల్లి రాధాకృష్ణ, తోట నర్సయ్య, సహాయ కార్యదర్శులుగా డేగల కృష్ణ, తూతుకు మోహన్ రావు, కోశాధికారిగా పిట్టల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పసుపులేటి జనార్ధన్, కట్టబోయిన శ్రీనివాస్, గాలి వెంకటేశ్వర్లు, సోమగాని శేష రత్నప్రసాద్ (ఎస్.ఎస్.ఆర్), ఉప్పు రాములు, గాలి శ్రీనివాస్, కొలిశెట్టి వెంకట కృష్ణారావు, యెడబోయిన శ్రీను, గన్నా జానకిరాములు, పసుపులేటి శ్రీనివాస్, గాలి సుధీర్, సకినాల కృష్ణ, పిన్ని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ట్రస్ట్, సంఘ అభివృద్ధితో పాటు ముస్నూరు కాపుల ఐక్యతకు కృషి చేస్తామని తెలిపారు. సభ్యులందరి సహకారంతో ట్రస్ట్‌ను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

**ట్రస్ట్ అభివృద్ధి కమిటీ:** ట్రస్ట్ అభివృద్ధి కమిటీ సభ్యులుగా పెద్దిరెడ్డి గణేష్, పెద్దిరెడ్డి రాజా, పందిరి వెంకటేశ్వరమూర్తి, ఉప్పు శ్రీనివాసరావు, గాలి సాయి, బీబీరెడ్డి లక్ష్మయ్య, ఎం. దశరథ రామారావు, సంగాని రజనీకాంత్ (USA), మధు శ్యామ్, మానేపల్లి లక్ష్మయ్య, గాలి వెంకటేశ్వర్లు, గాలి శ్రీనివాస్ రావు (USA) ఎన్నికయ్యారు.



# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం : జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 27 (వాయిస్ టుడే): ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ. ఈ సందర్భం గా ఎస్పీ మాట్లాడుతూ... ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని , బాపూజీ ఆశయాల మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని చెప్పారు.దేశ స్వాతంత్ర్యోద్యమం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం లో ఆయన అలుపెరగని పోరాటం చేసి తన జీవితాన్నే అంకితం చేశారని గుర్తుచేశారు. నమ్మిన సిద్ధాంతా నికి కట్టుబడి స్వశక్తితో ఎదిగిన మహోన్నత వ్యక్తి ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్.ఎస్.ఐ శ్రావణ్ యాదవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

**- సీఎం రేవంత్ రెడ్డి కి మాజీ సర్పంచుల జేఏసీ విజ్ఞప్తి**

**- అభివృద్ధి పనులపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలి : అక్కెనపెల్లి కరుణాకర్**

సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 27 (వాయిస్ టుడే): 2019--2024 కాలంలో గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేపట్టిన మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి లేఖను అందజేసినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మాజీ సర్పంచులు అనేక పనులు చేపట్టారని, వాటికి సంబంధించిన బిల్లులు ఇప్పటికీ పూర్తి గా చెల్లించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కరుణాకర్ పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వం, అధికారులు, ప్రజలు వినియోగిస్తు న్నప్పుడు వాటికి సంబంధించిన అర్హత కలిగిన బిల్లులను మాత్రం ప్రభుత్వం మారిందనే కారణంతో పెండింగ్‌లో ఉంచడం సరికాదని ఆయన అన్నారు. ప్రభుత్వాలు మారడం ప్రజాస్వామ్య ప్రక్రియలో సహజమేనని, ప్రజా అవసరాల కోసం నిబంధనల ప్రకారం చేపట్టిన పనులకు సంబంధించిన చెల్లింపుల బాధ్యత కొనసాగుతుందని పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులపై స్పష్టమైన ప్రకటన చేయాలని, అర్హత కలిగిన బిల్లులను తక్షణమే విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గున్నాల లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు తాడేపు ఎల్లం, రాసురి రాజేశం, గుంటి శంకర్, ఆరే రాజు, మునిగే దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆప్యాయ పలకరింపులు

**సామాన్యుడిలా బల్లపై కూర్చొని టీ తాగిన డిప్యూటీ సీఎం**

**ముదిగొండ టీ స్టాల్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముచ్చట్లు**







ముదిగొండ మండలం సెప్టెంబర్ 27 వాయిస్ టుడే : అధికార గర్వం లేని ఆత్మీయత, ప్రజా నాయకుడికి ఉండాల్సిన నిజమైన నిరాడంబరత ముదిగొండ మండల కేంద్రంలో శనివారం ఆవిష్కృతమైంది. మధిర నియోజకవర్గ పర్యటనలో భాగంగా వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన హోదాను పక్కనబెట్టి, అత్యంత సాధారణ మానవుడిలా ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రజల మధ్యన గడిపారు.?ముదిగొండ సెంటర్‌లోని 'నీల్ కమల్ టీ స్టాల్' వద్ద కాన్వాయ్‌ను ఆపిన డిప్యూటీ సీఎం, అక్కడ ఉన్న బల్లపై కూర్చొని ప్రశాంతంగా టీ తాగారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్వయంగా తమ ముందుకు వచ్చి సామాన్యుడిలా టీ తాగుతుండడం చూసి స్థానికులు, ప్రయాణికులు ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. ఆయనను చూసేందుకు, మాట్లాడేందుకు జనం పోటీ పడగా, యువత ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు. ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరిస్తూ భట్టి విక్రమార్క అందరి మనస్సులను గెలుచుకున్నారు.

**ప్రజా సంక్షేమంపై ప్రత్యక్ష ఆరా**

టీ స్టాల్ పరిసరాల్లో ఉన్న మహిళలను ఆప్యాయంగా పలకరించిన డిప్యూటీ సీఎం, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారి బానోతు రాంజీ, కూరగాయల వ్యాపారి నరసమ్మలను పలకరించి, ముదిగొండలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులపై అభిప్రాయం అడిగారు. "సార్, మునుపటి కంటే ఇప్పుడు రోడ్డు వెడల్పు కావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది" అని నరసమ్మ సంతోషం వ్యక్తం చేశారు. కాగా, విస్తరణలో ఇండ్లు కోల్పోయామని కొందరు ఆయన దృష్టికి తేగా, "ఎవరూ ఆందోళన చెందవద్దు, ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున ఇండ్లు ఇస్తాం" అని భరోసా ఇచ్చారు.

రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకునే పల్లె నాగభూషణంను డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా పలకరించి కులవృత్తి, కుటుంబ పోషణ గురించి అడిగారు. దుమ్ము ధూళితో ఇబ్బంది పడుతున్నానని, ఆర్థిక సహకారం అందిస్తే చిన్న డబ్బా ఏర్పాటు చేసుకుంటానని నాగభూషణం కోరగా... ఆయన కుమారుడు పల్లె సురేష్ పేరిట 'రాజీవ్ యువ వికాసం' కింద రూ. లక్ష వరకు రుణ సహాయం అందిస్తామని మాట ఇచ్చారు. వెంకటాపురం గ్రామానికి చెందిన యండ్రాతి యశోద అనే నిరుపేద మహిళ ఇద్దరు ఆడపిల్లలతో అద్దె ఇంట్లో పడుతున్న కష్టాలను వివరించగా, తక్షణమే స్పందించిన డిప్యూటీ సీఎం... రాబోయే 'ఇందిరమ్మ ఇండ్ల' జాబితాలో ఆమెకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేయాలని అక్కడే ఉన్న సర్పంచ్‌ను ఆదేశించారు. అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీ ?అనంతరం ముదిగొండలో రూపుదిద్దుకుంటున్న 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (జఎజ) నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మిగిలిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దానితో పాటు పట్టణంలో శరవేగంగా జరుగుతున్న రోడ్డు వెడల్పు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. ఒకే రోజు నియోజకవర్గ అభివృద్ధి పనులను సమీక్షిస్తూనే, మరోవైపు సామాన్య ప్రజల కష్టాలను ఆలకించి అక్కడికక్కడే పరిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీరుపై ముదిగొండ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

# సదుల నగర్ గ్రామంలోని బోనమ్మ వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నిమజ్జనం

**నిమజ్జనానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి**



నర్సాపూర్ (వాయిస్ టుడే): హత్నూర మండల పరిధిలోని సాధు నగర్ గ్రామంలో బోనమ్మ వినాయక కమిటీ ఆధ్వర్యంలో 13 రోజులు పూజలు అందుకున్న బొజ్జ గణపయ్య మొదటి లడ్డు 40, 500 40 వేల 500 రూపాయలకు మూత వెంకటేశం కైవాసం చేసుకున్నారు స్వామి వారి రెండవ లడ్డు తలారి లక్ష్మయ్య 17వేల రూపాయలకు స్వామివారి లడ్డు ప్రసాదం అందుకోవడం జరిగింది ఈ సందర్భంగా బోనమ్మ యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ బొజ్జ గణపయ్య పిల్లాపాపలను సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంచాలని ఆ స్వామి వారిని వేడుకున్నారు ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు చేసి వైభవంగా నిమజ్జనం నిర్వహించడం జరుగుతుందని సాధువుల నగర్ బోనమ్మ యూత్ సభ్యులు తెలిపారు వినాయక నిమజ్జం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో సదుల నగర్ గ్రామ పెద్దలు మహిళలు భోనమ్మ యువత సభ్యులు పాల్గొన్నారు.

# నర్సంపేటలో జిల్లా యూత్ కాంగ్రెస్ సమావేశం

వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 27 : రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివ చరణ్ రెడ్డి మరియు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ సయ్యద్ ఖలీద్ అహ్మద్ ఆదేశాల మేరకు నర్సంపేట లో వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్ అధ్యక్షతన డిస్టిక్ యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూత్ కాంగ్రెస్ నేషనల్ సెక్రెటరీ తెలంగాణ స్టేట్ ఇంచార్జ్ రోషిని జష్వాల్ అలాగే తెలంగాణ స్టేట్ యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ హరిప్రసాద్, లీగల్ సెల్ సయ్యద్ కమ్రుద్దీన్ కార్యనిర్వాహక సమావేశంలో పాల్గొనడం జరిగిందని కొరివి పరమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. సిద్ధం.ఉజ్వల్ రెడ్డి**

**జహీరాబాద్‌లో ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ఎన్నికల ప్రచార ర్యాలీ**

జహీరాబాద్, వాయిస్ టుడే సెప్టెంబర్ 27: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రామిక వర్గం, ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని ఆర్టీసీ యూనియన్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని ఘర్ ధాబా నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రచార ర్యాలీలో తెలంగాణ ఆర్టీసీ యూనియన్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బొంతు రామ్మోహన్, ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల నూతన అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ అశ్వత్థామ రెడ్డి గార్లతో కలిసి డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సుదీర్ఘకాల సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే పోరాటాల అనుభవం ఉన్న బొంతు రామ్మోహన్ నేతృత్వంలో జలమండలి ఎన్నికల్లో విజయం సాధించిన రీతిలోనే, రాబోయే ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాలు ఘనవిజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి. నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మహ్మద్ యూనూస్, కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, జమిలాలోద్దిన్, జావిద్,అరుణ్ కుమార్,నిజాం,ఖదీర్,అతిక్,సీడీసీ డైరెక్టర్ మల్లారెడ్డి,సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి,ఇమామ్ పటేల్,బర్కత్ మరియు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగ, కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.



# 16 వార్డులో బోరుకు మోటార్ ప్రారంభించిన వార్డ్ కౌన్సిలర్ అల్కూరి పావని

మక్తల్ సెప్టెంబర్ 27 వాయిస్ టుడే ప్రతినిధి: మున్సిపాలిటీలోని 16 వ వార్డులో ఇటీవల దాత మౌలానా కౌసర్ తన సొంత నిధులతో వార్డులో వేయించిన ఉచిత బోరుకు ఆదివారం రోజు మోటార్ బిగించి చేయడం జరిగిందని వార్డ్ కౌన్సిలర్ అల్కూరి పావని తెలిపారు. ఈ సందర్భంగా దాత మౌలానా కౌసర్ కు ధన్యవాదాలు చెప్పారు. ప్రస్తుత నేపథ్యంలో... తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో వార్డు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పూర్తిగా సొంత నిధులతో బోరు వేయించిన కౌసర్ కు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా వార్డులో అభివృద్ధి పనులను చేయిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, కోఆప్షన్ సభ్యులు వల్లంపల్లి లక్ష్మణ్, వార్డ్ ఆఫీసర్ విష్ణు, స్థానిక నాయకులు జయనంద్, మనవర్ అలీ, రాజశేఖర్, ఆనంపల్లి రమేష్ ,కీర లింగ, బస్సు లింగ, మానసాని కిరణ్, గఫర్, నాసర్, మున్సిపల్ సిబ్బంది కురుమయ్య, అనిల్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ తూర్పులో కొండా లక్ష్మణ్ 112వ జయంతి వేడుకలు

వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 27 : స్వాతంత్ర సమరయోధుడు స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ 112 వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం వరంగల్ కొత్తవాడ జంక్షన్ లోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి మాజీ మంత్రి ఏమ్మెల్సీ బస్వా రాజ్ సారయ్య పూలమాల వేసి ఆయన కు ఘన నివాళులర్పించరు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో, నిజాం నిరంకుశ వ్యతిరేక పాల్గొన్నాడని, తెలంగాణ కోసం మంత్రి పదవిని కూడా వదిలేసిన నికార్సైన తెలంగాణ వాదని ఏ మ్మెల్సీ సారయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి , కూడా చైర్మన్ గుండు సుధారాణి, డిసిసి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ అయుబ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జిల్లా బీసీ డెవలప్మెంట్ అధికారి పుష్పలత, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బసవరాజు కుమారస్వామి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్ ,జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి గోరంటల రాజు,వరంగల్ జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సోమ లక్ష్మి, సీనియర్ నాయకురాలు గిరి గిరి పుష్ప, యూత్ కాంగ్రెస్ నాయకులు బత్తుల వినోద్, సీనియర్ నాయకులు ఇనుగాల బాబన్న, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కూరతోట సదానందం,కార్యదర్శి ధూపం సంపత్, కాంగ్రెస్ నాయకులు, పద్మశాలి సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ కి నివాళి అర్పించరు.



# కొమరం స్వరాజేశ్వరమ్మ ఆశయాలు కొనసాగిద్దాం

## మాజీ ఎంపీ మిడియం బాబురావు



భద్రాచలం, సెప్టెంబర్ 27 : సిపిఎం సీనియర్ నాయకురాలు కొమరం స్వరాజేశ్వరమ్మ ఆశయాలు కొనసాగిద్దామని మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు పిలుపునిచ్చారు. ఆదివారం దుమ్ముగూడెం మండలం సీతానగరం గ్రామంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకురాలు కొమరం స్వరాజేశ్వరమ్మ చిత్రపటానికి మీడియం బాబురావు, సీనియర్ నాయకురాలు భక్తుల హైమావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభ లో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మాజీ ఎంపీ మిడియం బాబురావు మాట్లాడుతూ సిపిఎం పార్టీ సీనియర్ నాయకురాలు తొలితరం మహిళా ఉద్యమ నేత కొమరం స్వరాజేశ్వరమ్మ స్ఫూర్తితో భవిష్యత్తులో ఉద్యమించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు స్వరాజేశ్వరమ్మ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి అనేక ఉద్యమాల పోరాటాల్లో ముందుండి పోరాటం చేసిన నాయకురాలని నేటి తరానికి ఆదర్శ నేతగా మంచి పేరు ప్రతిష్టలు భద్రాచలం నియోజవర్గ స్థాయిలో ఉద్యమ పోరాటాల్లో ముందుండి పనిచేశారని గుర్తు చేశారు ముఖ్యంగా వాజేడు నుండి మొదలుకొని భద్రాచలం వరకు వ్యవసాయ కూలి రేట్లు పెంచడం కోసం అదే విధంగా ఆ ప్రాంతంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టే విధంగా ఐక్య పోరాటాలు చేయడంలో ముందుండి నడిపిన నాయకురాలని సిపిఎం పార్టీకి ఓ కార్యకర్తగా చేరి అంచలంచెలుగా మహిళా సంఘం ఉద్యమాల్లో ఉమ్మడి రాష్ట్రస్థాయి సభ్యురాలుగా పనిచేశారని మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగిన ఎదిరించి నిలబడే వారని గుర్తు చేశారు ఆమెను నడిపించడంలో తన భర్త కొమరం నాగయ్య ప్రధాన పాత్ర పోషించారని వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు అయినప్పటికీ స్వరాజేశ్వరమ్మ కి మార్క్ లిస్ట్ సాహిత్యం అందించి చదివించడం ప్రజల మీద ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టు ఏ విధంగా సాధించాలని నేర్పారని గుర్తు చేశారు అదేవిధంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ మాట్లాడుతూ స్వరాజేశ్వరమ్మ స్ఫూర్తితో గ్రామ గ్రామాన ఆమె భద్రాచలం నియోజకవర్గం ఏ విధంగా అయితే సిపిఎం ఎర్రజెండా పట్టుకుని ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా పోరాటం చేసిందో ఈనాటి యువతీ యువకులందరూ పెద్ద ఎత్తున ఉద్యమాలలో పాల్గొనాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు ముఖ్యంగా ఆమె నమ్మిన ఎర్రజెండా సిద్ధాంతం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దుమ్ముగూడెం మండలంలో త్రాగునీరు సాగునీరు విద్య వైద్యం కోసం అనలేని పోరాటం చేసిన వీర వనితని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో తునికాకు కట్ట రేటు పెంచే విషయంలో కలేదార్ల కమిషన్ కళ్ళల్లో పని చేసే పనులు రేట్లు పెంచే విషయంలో కూడా తమ నాయకత్వం వహించేదని గుర్తు చేశారు అందుకని ఆమె నమ్మిన సిద్ధాంతానికి ప్రాధాన్యత ఇచ్చి పనిచేసిన గొప్ప నాయకురాలని కొనియాడారు గిరిజన హక్కులు చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని ఉద్యమాలు చేశారు అని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకురాలు బత్తుల హైమావతి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో మహిళా హక్కులు సమస్యలను పై తొలి కమ్యూనిస్టు మహిళ నేతగా కొమరం స్వరాజేశ్వరమ్మ మేమందరం కలిసి వాజేడు నుంచి భద్రాచలం వరకు అనేక పోరాటాల్లో పాల్గొని ప్రసంగించారు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పి సోమయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం మే లక్ష్యంగా పనిచేసేవాలము సిద్ధాంతం కోసం రాజీవ్ రాజీలేని చేసిన గొప్ప నాయకురాలు అని గుర్తు చేశారు అంతే కాదు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో ముర్రెళ ఎర్రయ్య రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు ఒక ఆదివాసి మహిళా నేతగా ఆయనతో భద్రాచలం ఎనిమిది మండలాలలో చింతూరు నుండి మొదలుకొని ఇటు వాజేడు వరకు ఏ గ్రామంలో ఏ సమస్యలున్నాయో అధ్యాయం చేసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లి ఆ సమస్యలను అసెంబ్లీ దాకా పంపించే విషయంలో మంచి పాత్ర పోషించా రని ఆమె గుర్తు చేశారు నేటి యువత ఆమె స్ఫూర్తితో ఆమె అడుగుజాడల్లో పనిచేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, మాజీ డిసిసిబి చైర్మన్ యలమంచి రవికుమార్, సిపిఎం సీనియర్ నాయకులు చింతూరి వెంకటరావు, అన్నవరపు సత్యనారాయణ, ఎంబి నర్సారెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కొమరం దామోదర్, కొమరం పణేశ్వరమ్మ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, బండారు శరత్ బాబు,సరియం కోటేశ్వరరావు, యలమంచి శ్రీనుబాబు, కొమరం చంటి, కొడాలి లోకేష్, సోయం వీర్రాజు, మహమ్మద్ బేగ్, సర్పంచ్ సరియం రాజమ్మ, కాక కృష్ణ, సున్నం నరసింహ చారి, కూరం వీరభద్రం, సోయం నాగమణి, గుడ్ల రామ్మోహన్ రెడ్డి, కుమారుడు టీచర్ కొమరం శ్రీనివాస్ రావు, పెద్ద కూతురు అలివేలి, మాజీ సర్పంచ్ సిహెచ్ మిత్ర, హరిబాబు, కనకారావు, రంగయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

## విజయవాడలో తీవ్ర విషాదం

### విధి నిర్వహణలో ఉండగానే గుండెపోటుతో నున్న సీఐ అహ్మద్ అలీ కన్నుమూత



కృష్ణా జిల్లా/ఎన్టీఆర్ జిల్లా(వాయిస్ టుడే): విజయవాడ పోలీస్ కమీషనరేట్ పరిధిలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. నగరంలోని గాంధీనగర్ అలంకార్ సెంటర్ (ధర్నా చౌక్) వద్ద విధి నిర్వహణలో ఉన్న నున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ (జ×) అహ్మద్ అలీ హఠాత్తుగా గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఊహించని ఘటన పోలీస్ శాఖతో పాటు నగర ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.ధర్నా చౌక్ వద్ద ఆదివారం ఉదయం సచివాలయ ఉద్యోగులు భారీ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ క్రమంలో నిరసనకారులను అదుపు చేసే క్రమంలో పోలీసులకు, ప్రదర్శనకారులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. అక్కడ నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత, మానసిక ఒత్తిడి కారణంగా సీఐ అహ్మద్ అలీ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయారు.ఆయన కిందపడిపోవడాన్ని గమనించిన తోటి పోలీస్ సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. సమయం వృధా చేయకుండా ఆయనను రక్షించేందుకు సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి అత్యవసరంగా తరలించారు. అయితే, ఆసుపత్రిలో వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించడంతో విషాద ఛాయలు అలముకున్నాయి.సమర్థుడైన, నిబద్ధత గల అధికారిగా పేరు తెచ్చుకున్న అహ్మద్ అలీ.. ఇలా విధి నిర్వహణలోనే కన్నుమూయడంపై ఉన్నతాధికారులు మరియు సహచర సిబ్బంది తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన హఠాన్మరణం పట్ల పలువురు పోలీస్ అధికారులు నివాళులర్పించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేసిన ఆయన సేవలను స్మరించుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.



## అవోపా ధర్మపురి మండల నూతన అధ్యక్షుడిగా రంగ శ్రీనివాస్

### – సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు





ధర్మపురి, సెప్టెంబర్ 27 (వాయిస్ టుడే) : జగిత్యాల జిల్లాలోని ధర్మపురి పట్టణ కేంద్రంలో గల స్థానిక ఆర్య వైశ్య సంఘ సమావేశ మందిరం యందు ఆదివారం రోజు సాయంత్రం వేళలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాజేషుని శ్రీనివాస్, జక్కు రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో పలు అంశాల పైన చర్చించి పాత కమిటీ పదవి కాలంలో పూర్తి అయినా నేపథ్యంలో నూతన కమిటీ సభ్యుల ఎన్నిక నియామక ప్రక్రియను నిర్వహించి పలు అంశాలను తీర్మానించి నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అవోపా ధర్మపురి మండల శాఖ గౌరవ అధ్యక్షుడిగా జక్కు రవీంధర్, అధ్యక్షుడిగా రంగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జోన్నల వీరేషం, ఆర్థిక కార్యదర్శిగా అక్కన పెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా – ముత్యపు రమేష్, దోంతుల శ్రీధర్, సాదు శ్రీకాంత్, ఆర్గనైజర్ సెక్రటరీగా కోండ వినయ్ కుమార్, డైరెక్టర్లుగా మహంకాళి సుమిత్ చంద్ర, అక్కన పెల్లి అజయ్, గోలి ఆకాష్, రంగ శ్రీ చరణ్ నూతన కమిటీ సభ్యులుగా ఎన్నిక అయినట్టు వారు మీడియాకు తెలిపారు, ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, సంఘ సభ్యులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## నిలబడు...ప్రశ్నించు..పోరాడు!

**(నేడు సెప్టెంబర్ 28 భగత్ సింగ్ జయంతి సందర్భంగా యువతకు మేల్కొలుపు).**



నిశ్శబ్దంగా భరించడం నిర్జీవ లక్షణం,
నిలబడి ప్రశ్నించడమే 'భగత్' ఆలోచనా విధానం!
మత్తు వదిలి మేల్కో ఓ నవతరం యువకుడా..!
అన్యాయాన్ని ఎదిరించడమే కదా విప్లవ ప్రథమ పాఠం!ఇంక్విలాబ్ జిందాబాద్... ఇంక్విలాబ్ జిందాబాద్!ఆనాడు తెల్లదొరల గుండెల్లో నిద్రపోయావు..!
నేడు దిశాహీనమైన తరాన్ని ఉరకలెత్తించాల్సిన స్ఫూర్తివి నీవు !
వ్యసనాల ఊబిలో, సామాజిక మాధ్యమాల మాయలో పక్కదారి పడుతున్న యువశక్తి ని మేల్కొల్పాలి నీవు ! చేతిలో డిగ్రీలు న్నా కొలువులు లేక, నిరుద్యోగ రక్కసి కోరల్లో నలిగిపోతూ, ఆశలు కోల్పోయి ఆత్మహత్యలకు శరణు అంటున్నారు నీ సోదరులు ! ఉరితాడును ముద్దాడిన వీరుడి వారసులై సమస్యలకు భయపడి వెనకడుగు వేస్తారా? నాడు నువ్వు చెప్పిన సత్యం నేటికీ సజీవం! పాలకుల రంగులు మారినా మారలేదు సామాన్యుడి భాగ్యం! ప్రజా వ్యతిరేక విధానాల చీకట్లను చీల్చడానికి,
ఉపాధి హక్కుల ఉషోదయాన్ని తేవడానికి,
నీ ఆలోచనలకు పదును పెట్టు...
నీ గొంతుకను సానబెట్టు!
విజ్ఞానపు పుస్తకమే నీ ఆయుధం,
కులమతాల విభేదాలు వీడటమే నీ ప్రథమ కర్తవ్యం! హక్కుల సాధనకై రాజ్యాంగబద్ధంగా కదం తొక్కు, నిరంకుశత్వపు పునాదులు కదిలేలా నినదించు! 23 ఏళ్లకే దేశం కోసం ప్రాణాలర్పించిన ఆ అగ్నికణం,నేటి మన పోరాటాలకు ఎప్పటికీ ఒక దిక్సూచి !
భగత్ సింగ్ ఆశయాలను గుండెల్లో నింపు కుందాం!
అసమానతలు లేని సమసమాజం కోసం నినదిద్దాం!!

.....( గిరి ప్రసాద్ సోముల.., జర్నలిస్ట్ )



## నర్సంపేటలో జిల్లా యూత్ కాంగ్రెస్ సమావేశం

వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 27 : రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివ చరణ్ రెడ్డి మరియు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ సయ్యద్ ఖలీద్ అహ్మద్ ఆదేశాల మేరకు నర్సంపేట లో వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్ అధ్యక్షతన డిస్టిక్ యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూత్ కాంగ్రెస్ నేషనల్ సెక్రెటరీ తెలంగాణ స్టేట్ ఇంచార్జ్ రోషిని జస్వాల్ అలాగే తెలంగాణ స్టేట్ యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ హరిప్రసాద్, లీగల్ సెల్ సయ్యద్ కమ్రుద్దీన్ కార్యనిర్వాహక సమావేశంలో పాల్గొనడం జరిగిందని కొరివి పరమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అక్షరాస్యత పెంపే లక్ష్యం

రాయికల్, (వాయిస్ టుడే): వయోజనుల్లో అక్షరాస్యతను పెంపొందించి, చదవడం, రాయడం, ప్రాథమిక సంఖ్యా పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు రోజువారీ జీవితంలో వాటిని వినియోగించుకునేలా చేయడమే ఉల్లాస్ పరీక్ష ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్, చైర్మన్ కట్కం రవీందర్ ఆధ్వర్యంలో ఉల్లాస్ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 180 మంది హాజరై పరీక్ష రాసినట్లు మెప్మా టీఎంసీ రాధా తెలిపారు. అక్షరాస్యతతో పాటు ఆర్థిక, డిజిటల్, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించడం ద్వారా వయోజనుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పర్యటన దినోత్సవం

రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ పట్టణ శ్రీ చెన్నకేశవ నాథ త్రికుటాలయం రాయికల్ లో ప్రపంచ పర్యాటక దినోత్సవం కు ముఖ్య అతిథిగా వచ్చిన శాసన సభ్యులు సంజయ్ కుమార్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలు తెలిసే విధంగా ,యువత కు ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టించే విధంగా,రాష్ట్రంలో పర్యాటక రంగం 50 వేల కోట్ల అభివృద్ధి సాధించే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగం అభివృద్ధి కి కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్,ఆత్మ చైర్మెన్ కాటిపెళ్ళి గంగారెడ్డి, వైస్ చైర్మన్ సౌజన్య శ్రీదర్ రెడ్డి,కమిషనర్ మనోహర్ గౌడ్ ,పాక్స్ చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి,మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మండ్లు మాజీ వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్ లు పల్లికొండ గంగాధర్,మౌనిక,మానస,శ్రీదర్,రాకేష్ నాయక్,మచ్చ గంగ లక్ష్మీ శేఖర్, కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, మహేష్ గౌడ్,లత మురళి, సర్పంచ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
సోమవారం 28 సెప్టెంబరు 2026

# దేశ వ్యాప్తంగా 2026 సెప్టెంబర్ 28,29,30 తేదీల్లో జరిగే బ్యాంక్ ఉద్యోగుల సమ్మె కు సీఐటీయూ మద్దతు

## నెమ్మాది వెంకటేశ్వర్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి



సూర్యాపేట టౌన్ : వారానికి ఐదు రోజులు పని విధానాన్ని అమలు చేయాలని పీ ఎల్ ఐ (ప్రోడక్టివిటీ లింక్డ్ ఇన్సెంటివ్ ) పథకం అమలులో ఏకపక్ష ధోరణి ని వ్యతిరేకిస్తూ 12వ, వేతన ఒప్పందం లోని మిగిలిన డిమాండ్ లను పరిష్కరించాలని సెప్టెంబర్ 28,29,30 తేదీల్లో జరగనున్న మూడు రోజుల సమ్మె కు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నె మ్మా ది వెంకటేశ్వర్లు తెలియ జేశారు. ఆదివారం నాడు సీఐటీయూ కార్యాలయం లో జరిగిన విలేకర్ల సమావేశం లో మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నముకగా ఉన్న ప్రభుత్వ బ్యాంకింగ్ రంగాన్ని శరవేగంగా ప్రయివేట్ పరం చేసే ప్రయత్నలకు తోడు ఉద్యోగ, అధికారుల సంఘాలతో చేసుకున్న ఒప్పందాలను తుంగలో తొక్కి ఏక పక్ష నిర్ణయాలను అమలు చేయడం కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వ కార్మిక విధానాలపై గత 12 సవంత్సరాలుగా బ్యాంక్ ఉద్యోగులు సమ్మెలు, పోరాటాలు చేస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరిలో మార్పు లేదన్నారు. ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని, 2023 లో ఐ బి ఏ -యూ ఎఫ్ బి యు ల మధ్య అంగీకారం కుదిరి మూడు సంవత్సరం అయినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పు రాక పోవడం అన్యాయమన్నారు. బ్యాంక్ లాభాల ఆధారంగా ఉద్యోగులు, అధికారులకు ఐదు రోజులు, పది రోజులు, పదిహేను రోజుల చొప్పున ఇన్సెంటివ్ ఇవ్వాలని సుధీర్ఘ చర్చల అనంతరం ఒప్పందం కుదిరి సంవత్సరాలుగా అమలు అవుతున్న ఒప్పంధాన్ని భగ్నం చేయడం అన్యాయం అన్నారు..

దేశం లో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య అనంతరాలు సృష్టిస్తూ నిరుద్యోగం పెంచుతూ ఉపాధి హామీ చట్టాన్ని లేకుండా చేసే కుట్రలు చేస్తూ జీ రామ్ జీ పథకాన్ని తెచ్చిందన్నారు.రాష్ట్రాల మీద భారం పెట్టుతూ కేంద్రం తపించుకుంటుందని నెమ్మాది అన్నారు... కార్మిక లేబర్ కోడ్లు, విధ్యుత్ సవరణ చట్టం, రైతు నల్లా చట్టాలు తెచ్చి అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచిధన్నారు. గత 60 సంత్సరాలు గా బ్యాంకింగ్ రంగం లో అమలు లో ద్వైపాక్షిక ఒప్పందాల విధానాన్ని విచ్చిన్నం చేస్తున్న చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా చేస్తున్న మూడు రోజుల బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దత్తు తెలియ జెస్తున్నామని నెమ్మాది తెలిపారు.



## ఘనంగా షేక్ సమీరా ఓణీల వేడుక

### పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

కృష్ణా జిల్లా/గన్నవరం(వాయిస్ టుడే): గన్నవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ షేక్ సమీరా ఓణీల (లంగా ఓణీ) వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో ఎంతో ఘనంగా నిర్వహించిన ఈ శుభకార్యానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా చిన్నారి సమీరాను ఆశీర్వదించి, ఆమెకు శ్రేయస్సు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో షేక్ బాషా, షేక్ ఫాతిమా, షేక్ హసీనా, షేక్ ఖాసిం వల్లి, షేక్ సుహాన, షేక్ అమేజాన్, షేక్ తాజు, షేక్ జైతునిసా, షేక్ షఫీ, పటాన్ నాగూర్ బాజీ, పటాన్ జిలాని, పఠాన్ సుభాని, పటాన్ జానీ, సయ్యద్ నజీర్, తదితర కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) సెప్టెంబర్ 27: తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా నిర్మల్ లో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ సమాజానికి అందించిన సేవలను, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన బాపూజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని, తెలంగాణ ప్రజల హృదయాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



## సోన్‌లో ఘనంగా సిఎస్ఐ 80 వసంతాల ఆవిర్భావ మహోత్సవ వేడుకలు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) సెప్టెంబర్ 27: సోన్ మండల కేంద్రంలో గల సిఎస్ఐ చర్చిలో సి.ఎస్.ఐ చర్చి 80 వసంతాల ఆవిర్భావ మహోత్సవ వేడుకలను స్థానిక గురువులు రెవరెండ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి పిఎసిఎస్ చైర్మన్ కృష్ణ ప్రసాద్ రెడ్డి, సోన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొయినుద్దీన్ హాజరయ్యారు. వారు చర్చి ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. వారు క్రైస్తవ సోదరులకు సీఎస్ఐ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక గురువులు రెవరెండ్ కిరణ్ కుమార్ అతిథులను సన్మానించారు. అనంతరం క్రైస్తవ సోదరీ సోదరీమణులు చర్చిలో గీతాలాపనలు చేస్తూ, పాటలు పాడుతూ ఆరాధనలో పాల్గొన్నారు. అనంతరం దూదిగం పాస్టరేట్ ఇన్చార్జి గురువులు రెవరెండ్ కమలాకర్ సిఎస్ఐ చరిత్రను బోధిస్తూ వాక్యోపదేశం చేశారు. చర్చిలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం క్రైస్తవ సంఘస్తులు పాస్టర్లను సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రేమ విందు ఏర్పాటు సహా పంక్తిభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు పాల్ సువర్ణరాజ్, కొరటికల్ పాస్టర్ రెవరెండ్ డి. సోలమోన్ రాజ్, సోన్ క్రైస్తవ సంఘస్తులు, మాదాపూర్, మాదాపూర్ కాలనీ, కొరటికల్ క్రైస్తవ సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.



## గణనాథుడికి ఘన వీడ్కోలు.. భక్తిశ్రద్ధల మధ్య నిమజ్జన శోభాయాత్రలు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)సెప్టెంబర్ 27: నిర్మల్ జిల్లా:తానూర్ మండలంలో బెల్ తరుడా గ్రామంలో మహాత్మ యూత్. మరియు యువసేన యూత్ సభ్యులు వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో గణనాథుడి నిమజ్జన శోభాయాత్రలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు.భక్తులు గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జనానికి తరలించారు.డప్పుల మోతలు,డీజే పాటలు, యువత సాంస్కృతిక నృత్యాలతో శోభాయాత్రలు సందడిగా సాగాయి.పలుచోట్ల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించారు.భక్తులు,నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలు భక్తి, ఉత్సాహాల మధ్య ముగిశాయి. ఈ కార్యక్రమంలో సభ్యులు రాజు. ఉమేష్. శంకర్. మహేష్ యోగేష్ .సురేష్. డి రవి. లక్ష్మణ్ మల్లేష్. కృష్ణ. గంగాధర్ కే రవి పాల్గొన్నారు.

## జహీరాబాద్ మీదుగా బుల్లెట్ రైలు నడపాలి

**పారిశ్రామిక జహీరాబాద్‌కు బుల్లెట్ రైలు అవసరం**

**జహీరాబాద్ మీదుగానే అలైన్‌మెంట్ ఉండాలి**

**న్యాల్‌కల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడలు భాస్కర్‌రెడ్డి పటేల్**



జహీరాబాద్, సెప్టెంబర్ 27 (వాయిస్ టుడే): ముంబై--హైదరాబాద్ బుల్లెట్ రైలు కారిడార్‌ను జహీరాబాద్ మీదుగా ఏర్పాటు చేయాలని న్యాల్‌కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి కోరారు. న్యాల్‌కల్--జహీరాబాద్ ప్రాంతం నిమ్జ్ (చీ×ఫ్గీ) పరిశ్రమల అభివృద్ధితో భవిష్యత్తులో జాతీయ స్థాయిలో పారిశ్రామిక కేంద్రంగా ఎదగనున్న నేపథ్యంలో, బుల్లెట్ రైలు మార్గాన్ని జహీరాబాద్ మీదుగా తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు..?ప్రాంతీయ పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధికి ఈ బుల్లెట్ రైలు కారిడార్ ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసే అలైన్‌మెంట్‌లో జహీరాబాద్‌కు అధిక ప్రాధాన్యం కల్పించాలని కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## ఘనంగా ఐలమ్మ జెండా ఆవిష్కరణ



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) సెప్టెంబర్ 27: ఆదివారం నిర్మల్ జిల్లా తానూరు మండలం లోని భామ్ని గ్రామం లో తెలంగాణా రైతంగా పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఐలమ్మ రజక సంక్షేమ సంఘము రాష్ట్ర ఉపాధ్యాక్షులు సుంకేటపోశెట్టి స్థానిక సర్పంచ్ డి. గణేష్ తొ కల్సి ఐలమ్మ జండాను ఆవిష్కరించారు. ఇసందర్భంగా సుంకేటపోశెట్టి మాట్లాడుతూ, భూమి భుక్తి పేద ప్రజల విముక్తి కోసం, ఆనాటి నిజామ్ పరిపాలనలో సామంతరాజులైన విష్ణూర్ రామ చంద్ర రెడ్డి ఆరాచకాలపై విరోచిత పోరాటం చేసి దొరల గడి లను బద్దలు కొట్టి అనగారిన పేద ప్రజలకు అండగనిలిచిన మహా ధైర్య శాలి చాకలి ఐలమ్మ అని కొనియాదారు. ఇలాంటి వీర మాత ఐలమ్మ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని బీసీ లు రాజ్యాధికార దిసలో ముందుకు సాగాలని సుంకేటపోశెట్టి అన్నారు. ఇ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ డి. గణేష్, ఉప సర్పంచ్ మాధవ రావు పటేల్, మాజీ జిల్లా వైస్ చైర్మన్ భాశెట్టి రాజన్న, రజక సంఘ అధ్యక్షులు, గంగాధర్, వి డి సి.వివిధ ప్రజా సంఘాల నాయకులు శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) సెప్టెంబర్ 27: నిర్మల్ జిల్లా:కుంటాల మండలంలోని కల్లూర్ గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే శ్రీ పవార్ రామారావు పటేల్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బాపూజీ చేసిన పోరాటం, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాప నామకరణ వేడుకలో పాల్గొన్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు

జహిరాబాద్ పట్టణంలోని శుభం గార్డెన్స్‌లో నిర్వహించిన న్యాయవాది నతనీయాల్ కుమార్తె నామకరణ మహోత్సవానికి జహీరాబాద్ శాసనసభ్యులుమాణిక్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారిని ఆశీర్వదించి, తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, కౌన్సిలర్ మహిపాల్ యాదవ్, హోతి (బి) గ్రామ సర్పంచ్ మచ్చేందర్, బుచినెల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచులు జె. రవికిరణ్, చిన్నారెడ్డిలతో పాటు నాయకులు మూర్తుజా, వెంకట్ రెడ్డి, శివప్ప, శశివర్ధన్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**